## శతాబ్ది ముగింపు వేడుకలు షురూ..

సిటీబ్యూరో, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ): చారిత్రాత్మక హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ నూరేండ్ల ముగింపు వేడుకలు ప్రారంభమయ్యాయి. ఆదివారం తాజ్ ఫలక్‌నుమాలో నిర్వహించిన 'హెచ్‌పీఎస్ విజన్ 2050 ఫండ్ రైజింగ్ డిన్నర్' కార్యక్రమం పూర్వ విద్యార్థుల హాజరుతో మొదలైంది. 1923లో చివరి నిజాం కాలంలో స్థాపించిన పాఠశాల నేడు ఎంతో మందిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దింది. సోమవారం ప్యానల్ డిస్కషన్స్‌లో ప్రముఖులు పాల్గొననున్నట్లు హెచ్‌పీఎస్ వైస్ ప్రిన్సిపాల్ అమృత తెలిపారు. సెంటినరీ వేడుకల్లో భాగంగా ఈనెల 25న స్టార్ట్‌ఎక్స్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ సమ్మిట్, హెచ్‌పీఎస్ సెంటినరీ వింటేజ్ కార్ షో నిర్వహణతో పాటు అనేక అంశాల్లో చర్చలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ నెల 26న సూపర్ కార్ షోతోపాటు చాయాచిత్ర ప్రదర్శన, ప్యానల్ డిస్కషన్స్ కొనసాగుతాయని వివరించారు. చివరి రోజైన 27న గ్రాండ్ సెలబ్రేషన్స్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్యానల్ డిస్కషన్స్‌లో ప్రసంగించడానికి సినిమా ఇండస్ట్రీ, రాజకీయ రంగం, వ్యాపార, వాణిజ్య రంగాల నుంచి ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఫార్మా, రియల్ ఎస్టేట్, విద్యా, వైద్య రంగాల నుంచి కూడా నిపుణులైన పూర్వ విద్యార్థులు హాజరవుతారని పేర్కొన్నారు.



మాదాపూర్‌లోని శిల్పారామంలో ఆదివారం కోలాహలం నెలకొన్నది. నగరవాసులు కుటుంబ సమేతంగా తరలివచ్చి సందడి చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



## రాష్ట్రీయ గౌరవ్ అవార్డులు ప్రదానం



తెలుగుయూనివర్సిటీ, డిసెంబర్ 24 : సమాజానికి సేవలందించే వారికి అవార్డులు మరింత ప్రోత్సాహాన్ని ఇస్తాయని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి అన్నారు. వివిధ రంగాల్లో సేవలందిస్తున్న పలువురికి ఆదివారం రెడ్‌హిల్స్ ఫ్యాప్సీలో జరిగిన కార్యక్రమానికి మల్లు రవి హాజరై రాష్ట్రీయ గౌరవ్ అవార్డులను ప్రదానం చేశారు. 2023 సంవత్సరానికి గాను దేశ వ్యాప్తంగా 120 మందిని ఈ అవార్డులకు ఎంపిక చేయగా... శోభాశెట్టి(బిగ్‌బాస్‌ఫేమ్), డాక్టర్ అశ్లేష(కౌన్సిలర్), మోనిష్ యర్రగుంట్ల(పారిశ్రామికరంగం), చరణ్ లక్కరాజు(విద్యారంగం), దేవి నాగవల్లి(మీడియా రంగం)కి అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సాత్విక గుప్తా, అఖిల్ సివ్వా, సినీ నిర్మాత రామ సత్యనారాయణ, ఫ్యాప్సీ ఉపాధ్యక్షుడు మీలా జయదేవ్, డిఫెన్స్ ఎస్టేట్స్ డైరెక్టర్ డి.మధుకర్‌నాయక్, టీటీడీ అధికార ప్రతినిధి తిరునగరి జ్యోత్స్న పాల్గొన్నారు.



### జీహెచ్‌ఎంసీ ఈవీడీఎంకు అవార్డు

గుజరాత్‌లో జరిగిన ట్రాన్స్‌పోర్టేషన్ రీసెర్చ్ గ్రూప్ ఆఫ్ ఇండియా 2023, 7వ కాన్ఫరెన్స్‌లో ట్రాన్స్‌పోర్టు అండ్ మొబిలిటీ నెట్‌వర్క్స్ విభాగంలో 'బెస్ట్ పేపర్ అవార్డు'ను అందుకుంటున్న జీహెచ్‌ఎంసీ ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్ రెడ్డి

– సిటీబ్యూరో, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ )



ముస్తాబైన బొగ్గులకుంటలోని సెంటినరి వెస్లీ చర్చి



అబిడ్స్‌లోని సెయింట్ జోసెఫ్ చర్చి

## క్రిస్మస్ శోభ

క్రిస్మస్ సందర్భంగా నగరంలోని పలు చర్చిలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. చర్చిల ప్రాంగణాల్లో ఏర్పాటు చేసిన పశువుల పాకలు, స్టార్‌లు, క్రిస్మస్ తాత బొమ్మలు, క్రిస్మస్ ట్రీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.





## హైటెక్స్‌లో ముగిసిన పెటెక్స్, కిడ్స్ ఫెయిర్







కిడ్స్ ఫెయిర్‌లో ఉత్సాహంగా గడిపిన చిన్నారులు

మాదాపూర్, డిసెంబర్ 24: మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఈ నెల 22న ఏర్పాటు చేసిన పెటెక్స్, కిడ్స్ ఫెయిర్ 2023 ఎక్స్ పోకు అనూహ్య స్పందన వచ్చింది. మూడు రోజులుగా కొనసాగుతున్న ఎక్స్‌పో ఆదివారంతో ముగిసింది. పెటెక్స్ ఇండియా ఎక్స్‌పోలో శునకాలు, పిల్లులు, పక్షులు, చేపలు, అన్యదేశ పెంపుడు జంతువులను ప్రదర్శించారు. ఇందులో 150 కి పైగా ఎగ్జిబిటర్లు తమ ఉత్పత్తులను ప్రదర్శించి సందర్శకులకు వాటి ఉపయోగాలను గురించి తెలియజేశారు. ప్లాస్టిక్ వాడకాన్ని అదుపులో ఉంచే ఈ డాగ ఫుడ్ వెండింగ్ మెషిన్ ఎక్స్ పో అనేక మంది సందర్శకులను విశేషంగా ఆకర్షించింది. అనంతరం శునకాలు, పిల్లుల యజమానులను నిర్వాహకులు సత్కరించారు.





## అరుదైన జీవాలు... జంతుజాలాలు





ఖైరతాబాద్, డిసెంబర్ 24 : నెక్లెస్‌రోడ్‌లోని పీపుల్స్‌ప్లాజాలో పెట్ స్టార్ పేరుతో ఏర్పాటు చేసిన పెట్ కార్నివాల్‌లో అరుదైన జీవులు, జంతుజాలాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. తెలంగాణ కెనైన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్నివాల్‌లో కొండ చిలువలతో పాటు పక్షులు, వివిధ రకాల జంతువులను చూసేందుకు జంతు ప్రేమికులు భారీగా తరలివచ్చారు.









